ప్రజాశక్తి

గురువారం 22 డిసెంబర్ 2022 | 5 | పార్వతీపురం మన్యం



24 వరకు పరీక్ష ఫీజు గడువు పెంపు

ప్రజాశక్తి-కలెక్టరేట్

పదో తరగతి పరీక్ష ఫీజు గడువు ఈ నెల 24 వరకూ పెంచినట్లు డిఇఒ ఎస్.డి.వి.రమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానోపాధ్యాయుల వెబ్‌సైట్ లాగిన్ నుంచి అపరాధ రుసుం లేకుండా ఫీజు రూ.125 చెల్లించాలని తెలిపారు. రూ.50 అపరాధ రుసుంతో 29 తేదీ వరకు, రూ.200 అపరాధ రుసుంతో 2023 జనవరి 3, రూ.500తో 2023 జనవరి 9 వరకు పది ఫీజు చెల్లించడానికి గడువు పెంచినట్లు వెల్లడించారు. సంబంధిత పత్రాలతో ఆయా తేదీల్లో ఎన్ఆర్ ఆన్‌లైన్‌లో మాన్యువల్ హార్డ్ కాపీలను సమర్పించాలని తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి ప్రదానోపాధ్యాయులు నామినల్ రోల్స్ ఈ నెల 29 నుండి 2023 జనవరి 9 లోగా సమర్పించాలని సూచించారు. ప్రదానోపాధ్యాయులంతా పది పరీక్ష ఫీజును www.bse.ap.gov.in వెబ్‌సైట్ నుండి పాఠశాల లాగిన్‌లో చెల్లించాలని వివరించారు.



తెలుగు తమ్ముళ్లలో నూతనోత్తేజం

- నేటి నుంచి మూడు రోజులపాటు చంద్రబాబు పర్యటన
- రాజాం, బొబ్బిలి, విజయనగరాల్లో బహిరంగ సభలు
- ఏర్పాట్లలో తలమునకలైన నాయకులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

టిడిపి అధినేత, మాజీ సిఎం నారా చంద్రబాబు నాయుడు చాలా కాలం తరువాత జిల్లా పర్యటనకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలుగు తమ్ముళ్లలో నూతనుత్తేజం కనిపిస్తోంది. సుమారు మూడున్నరేళ్లగా జిల్లా నాయకత్వం పెద్దగా పార్టీ కార్యక్రమాలు నిర్వహించకపోవడం, అధినేత వచ్చిన దాఖలాలు కనిపించకపోవడం, అధికార పక్షం దూకుడు వైఖరి మధ్య తెలుగు తమ్ముళ్ల ఢీలాపడ్డారు. ఇటువంటి పరిస్థితుల్లో చంద్రబాబు వరుసగా మూడు రోజులపాటు పర్యటిస్తుండడంతో పార్టీ కేడర్‌లో ఆసక్తి, ఉత్తేజం కనిపిస్తోంది. రాజాం, బొబ్బిలి, విజయనగరం నియోజకవర్గ కేంద్రాల్లో జరగబోయే బాబు బహిరంగ సభలకు నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా కేంద్రాలు పార్టీ జెండాలు, తోరణాలతో పుసుపమయంగా మారు తున్నాయి. ఇప్పటికే నాయకులు స్వాగత ఏర్పాట్లలో తలమనకలయ్యారు. పర్యటన విజయ వంతమయ్యేలా చూడాలంటూ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్నను రాష్ట్ర కేంద్రం జిల్లాకు పంపింది. వీరిద్దరూ బుధవారం విజయనగరం చేరుకుని స్థానిక నేతలు అశోక్ గజపతిరాజు, కిమిడి నాగార్జున తదితరులతో కలిసి చర్చించారు. మూడు చోట్ల జరిగే బహిరంగ సభలకు భారీగా జనాన్ని సమీకరించాలని ఆదేశించారు. ఆయా నియోకవర్గ నాయకులు కూడా గత కొన్ని రోజులుగా ఇదే పనిలో ఉన్నారు. చంద్రబాబు మూడు రోజుల పర్యటనలో మూడు నియోజవర్గాల్లో ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో మాట్లాడుతారు. దీనికి సంబంధించిన వివరాలను ఆ పార్టీ నాయకులు బుధవారం అశోక్ బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో స్పష్టం చేశారు. గురువారం ఉదయం విశాఖ నుంచి జిల్లాలో ప్రవేశిస్తారు. డెంకాడ మండలం నాతవలస టోల్‌గేట్ వద్ద జిల్లా నాయకత్వం స్వాగతం పలకనుంది. స్వాగత కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొనేందుకు డెంకాడ మండల నాయకులు భారీ ఏర్పాటు చేస్తున్నారు. రాజాం మండలం పొగిరి నుంచి చిలకపాలెం, రాపాక జంక్షన్, పొందూరు వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తారు. సాయంత్రం 5గంటలకు అంతకాపల్లి మీదుగా రాజాంలోని హెచ్‌పి పెట్రోల్ బంకుకు చేరుకున్నాక రోడ్‌షో ప్రారంభమవు తుంది. 6గంటలకు సూపర్ మార్కెట్ వద్ద సభలో చంద్రబాబు మాట్లాడుతారు. అనంతరం రాత్రి అక్కడే బసచేస్తారు. శుక్రవారం ఉదయం ఎస్‌సి, ఎస్‌టి నాయకులు, కార్యకర్తలతో మాట్లాడతారు. 23న మధ్యాహ్నం 2గంటలకు టెక్కలివలస, కంచరాం మీదుగా పెరుమాళి చేరుకుంటారు. అక్కడి నుంచి తెర్లాం, గంగన్నపాడు, నందిగాం, రాజేరు, పినపెంకి, కారాడ మీదుగా ద్విచక్ర వాహన ర్యాలీ సాగుతుంది. సాయంత్రం 5.30గంటలకు చర్చి సెంటర్ నుంచి ఓంకార్ థియేటర్, చాకలివీధి వరకు రోడ్డుషో ఉంటుంది. సాయంత్రం 6.20గంటలకు బహిరంగ సభలో పాల్గొంటారు.రాత్రికి రాజావారి ప్యాలెస్‌కు చేరుకొని అక్కడ బస చేస్తారు. 24న ఉదయం 11గంటల నుంచి 12.30గంటల వరకు దర్బార్ మహల్‌లో రైతులతో మాట్లాడుతారు. అనంతరం మెట్టవలస, సీతారాంపురం, పిరిడి, రామభద్రపురం, గజపతినగరం, బొండపల్లి, గొట్లాం మీదుగా ద్వారపూడి జంక్షన్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి వెంకటలక్ష్మి జంక్షన్ మీదుగా కోట జంక్షన్ వరకు రోడ్డుషో నిర్వహిస్తారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడుతారు.

స్టేషన్‌ను సందర్శించిన ఎస్‌పి



నూతన భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి విద్యాసాగర్

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు బుధవారం సాయంత్రం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ పనులను పరిశీలించారు. సంబంధిత సిబ్బందికి త్వరగా నిర్మాణ పనులు పూర్తిచేసి అందజేయాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి కృష్ణారావు, ఎల్విన్ పేట సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, ఎస్ఐ ప్రసాద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగంలో కేరళతో పోటీ

డిజిటల్ లిటరసీ అభివృద్ధి దిశగా అడుగులు • ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమంలో డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి-సాలూరు

విద్యారంగంలో కేరళ రాష్ట్రంతో ఆంధ్రప్రదేశ్ పోటీ పడేలా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు డిప్యూటీ సిఎం రాజన్నదొర చెప్పారు. సిఎం జగన్ మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 8వతరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. డిఇఒ రమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ సిఎం రాజన్నదొర మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత మూడేళ్లలో విద్యారంగం అభివృద్ధికి 57 వేల కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. ప్రతి పేద విద్యార్థి ఉన్నత విద్య అభ్యసించాలనే లక్ష్యంతో సిఎం జగన్ విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని తెలిపారు. అమ్మఒడి, విద్యా దీవెన, విద్యా కానుక, నాడు-నేడు వంటి పథకాలతో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా ఉన్నాయని చెప్పారు. గతంలో పేద కుటుంబం నుంచి ఎవరైనా డాక్టర్, ఇంజినీరు కావాలంటే వారి ఆస్తులమ్మి చదువుకునే వారని గుర్తుచేశారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వమే ప్రతి పేద విద్యార్థి.. డాక్టర్, ఇంజనీరుగా తయారవడానికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. దీనిలో భాగంగానే 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని వెల్లడించారు. డిజిటల్ లిటరసీ అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నట్లు చెప్పారు. తమ పిల్లలు ఉత్తమ పౌరులుగా తయారవడానికి తల్లిదండ్రులు కూడా బాధ్యత వహించాలని కోరారు.

కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో విద్యారంగ అభివృద్ధికి అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఒక్కో ట్యాబ్‌ని 32,500రూపాయలతో కొనుగోలు చేసి ప్రభుత్వం పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. బైజూస్ సంస్థతో ఒప్పందం చేసుకుని డిజిటల్ తరగతులు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 10,973 ట్యాబ్‌ల పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. హైస్కూల్ స్థాయిలో విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు వంగపండు అప్పలనాయుడు, జర్జాపు దీప్తి, కౌన్సిలర్ హరి అప్పలకొండ, రాపాక మాధవరావు, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, వైసిపి జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు, ఎంఇఒ బి.రాజ్ కుమార్ పాల్గొన్నారు.



సాలూరులో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

కురుపాం : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల వద్ద నియోజకవర్గంలోని ఐదు మండలాల 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్పొరేట్ విద్యకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. నాడు-నేడు ద్వారా మౌలిక సదుపాయాలు కల్పిస్తూ అమ్మఒడి, జగనన్న గోరుముద్ద, విద్యా దీవెన, వసతి కానుక లాంటి పథకాలు పెట్టి విద్యార్థులకు చదువుపై ఆసక్తి కలిగిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడు, ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి జి.సుజాత , వైసిపి జిల్లా అధికార ప్రతినిధి శెట్టి నాగేశ్వరరావు, మేజర్ పంచాయతీ సర్పంచ్ జి. సుజాత , ఉప సర్పంచ్ షేక్‌ఆదిల్, ఎంఇఒలు ఎన్.సత్యనారాయణ, నారాయణస్వామి, జిసిడిఒ రోజారాణి, కెజిబివి ప్రత్యేక అధికారి ఐ.కిరణ్ కుమారి, ప్రధానోపాధ్యాయులు టి.శంకర్రావు, తదితరులు పాల్గొన్నారు.



కురుపాంలో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణి

పార్వతీపురం టౌన్ : స్థానిక ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎమ్మెల్యే అలజంగి జోగారావు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బి.గౌరీశ్వరి, వైస్ చైర్మన్లు కె.రుక్మిణి, ఐ.గున్నేశ్వరరావు, ఎంపిపి మజ్జి శోభారాణి, వైస్ ఎంపిపి సిద్ధ జగన్నాధరావు, జెడ్‌పిటిసి బలగ రేవతమ్మ, ఎఎంసి చైర్‌పర్సన్ ఎం.భాగ్యశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే విజయవంతానికి కృషి



మాట్లాడుతున్న జెసి ఆనంద్

ప్రజాశక్తి-కలెక్టరేట్

సర్వే విజయవంతం చేసేందుకు రెవెన్యూ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ ఆనంద్ అన్నారు. జిల్లాలో నిర్వహిస్తున్న రీసర్వే ప్రక్రియపై మండల స్థాయి అధికారులు, సిబ్బందికి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వేపై స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. జిల్లాలో మొదటి విడతలో 102 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేశామన్నారు. రీసర్వే వంద సంవత్సరాల తరువాత నిర్వహించడం, ఇందులో భాగస్వామ్యం కావడం గర్వంగా భావించాలన్నారు. రెండో విడతలో 200 గ్రామాల్లో రీసర్వే చేస్తున్నామని చెప్పారు. భూమి హక్కు ఉన్న వారికి పట్టాలు ఇస్తామని తెలిపారు. డ్రోన్ సర్వేచేసి, ఫొటోలకు అనుగుణంగా గ్రామసభలు నిర్వహించి వివరాలు సేకరించాలని సూచించారు. కనీసం ఐదు సార్లు గ్రామసభలు నిర్వహించాలని చెప్పారు. రీసర్వే ప్రక్రియలో వినియోగించే పరికరాల వినియోగతపై అవగాహన ఉండాలన్నారు. రెండు నెలల్లో వంద గ్రామాల్లో సర్వే పూర్తి చేయాలన్నారు. మొదటి విడత సర్వే పూర్తి చేసిన అనుభవంతో రెండో విడత సర్వే పక్కాగా, పకడ్బందీగా చేపట్టాలని జెసి ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, జిల్లా కలెక్టర్ కార్యాలయ విభాగాధిపతులు శ్రీరామమూర్తి, జ్ఞాన వేణి, సర్వే శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి వనరులపై నిర్లక్ష్యం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం, కురుపాం ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న సాగునీటి వనరులపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని టిడిపి కురుపాం నియోజకవర్గ నాయకులు నందివాడ కృష్ణబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పంట పొలాలకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో టిడిపి హయాంలో నిర్మించిన చెక్‌డ్యాములు, మినీ రిజర్వాయర్లు శిథిలావస్థకు చేరినా వైసిపి ప్రభుత్వం దృష్టి సారించి మరమ్మతులు చేపట్టలేదని విచారం వ్యక్తంచేశారు. ఇదేనా వైసిపి చెప్పుకుంటున్న రైతు సంక్షేమ ప్రభుత్వం? అని ప్రశ్నించారు. రైతులు వర్షాధారంపై ఆధారపడి పంటలు వేసుకోవాల్సి వస్తుందని తెలిపారు.

ధాన్యం కొనాలని రైతుల ధర్నా



బలిజిపేట.. నారాయణపురం ఆర్‌బికె వద్ద ధర్నా చేస్తున్న రైతులు

ప్రజాశక్తి-బలిజిపేట

మండలంలోని నారాయణపురం గ్రామంలో రైతు భరోసా కేంద్రం వద్ద బుధవారం ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు గేదెల సత్యనారాయణ ఆధ్వర్యాన రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం, అధికారులు చెప్పినట్లుగా ధాన్యం సక్రమంగా కొనడం లేదన్నారు. గత 20 రోజుల నుంచి ధాన్యం నూర్పులు చేసి నెట్టుకొట్టి ఉంచినా ఫలితం లేదన్నారు. ఆర్‌బికెల ద్వారా గోనె సంచులు ఇవ్వడం లేదని చెప్పారు. రైతులకు సరిపడా సంచులు లేవని, ఇచ్చిన సంచులు కూడా నాసిరకమేనని తెలిపారు. పండగ దగ్గర పడుతున్నా ధాన్యం కొనకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొందని చెప్పారు. వెంటనే రైతుల ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు మావిడి సింహాద్రి నాయుడు, సిపిఎం నాయకులు భూరి నీలకంఠం, గౌరి, గోవింద, తదితరులు పాల్గొన్నారు.

తూనికలో మోసాలను అరికట్టాలని వినతి

జియ్యమ్మవలస : ధాన్యం రవాణాకు ఏర్పాట్లు చేసి, తూకంలో మోసాలను అరికట్టాలని కోరుతూ సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొల్లి గంగునాయుడు ఆధ్వర్యాన బుధవారం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యం సిద్ధం చేసి, వారం రోజులు దాటుతున్నా అమ్ముకోలేని పరిస్థితి మండలంలో ఉందన్నారు. సిఖబడి గ్రామానికి చెందిన ఎర్ర సత్యనారాయణ అనే రైతు గత వారం నూర్పు చేసి కళ్లంలో ధాన్యం నిల్వ ఉంచినా లారీలు లేకపోవడంతో తరలించలేదన్నారు. రైతుల రవాణా సౌకర్యం సమకూర్చుకోవాలని అధికారులు చెప్పడంతో ఇబ్బందులు తప్పడం లేదన్నారు. తూనికలోనూ నాలుగైదు కిలోల వరకు అదనంగా తీసుకుంటున్నారని తెలిపారు. వెంటనే తూనికలో మోసాలను అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కూరంగి సీతారాం, రైతు సంఘం నాయకులు ఎర్ర సత్యనారాయణ, సత్యం నాయుడు పాల్గొన్నారు.

టమోటా రైతులను ఆదుకోవాలని నిరసన

ప్రజాశక్తి-కొమరాడ

రైతులు పండించిన టమోటాకు గిట్టుబాటు ధర కల్పించాలని సిపిఎం జిల్లా నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో మండల కేంద్రం కొమరాడలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకవైపు ఏనుగుల బెడద, ఇంకో వైపు వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో టమోటా సాగుపై ప్రభావం చూపిందన్నారు. అరకొరగా పండిన పంటకు సరైన ధర లేకపోవడంతో రైతులు అప్పుల పాలై ఆత్మహత్య చేసుకునే పరిస్థితి కనిపిస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. ఆగస్టులో కిలో టమోటా రూ.70 వరకు ఉంటే, ప్రస్తుతం రూ.2కి ఎగతాళిగా కొనే పరిస్థితి నెలకొందన్నారు. వెంటనే అధికారులు స్పందించి గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీని వాస రావు, పోలినాయుడు, సాంబమూర్తి, వెంకట్రావు, శివ న్నాయుడు, తిరుపతిరావు, ఆదిబాబు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న టమోటా రైతులు



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా కోఆర్డినేటర్ చంద్రావతి

విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేకశ్రద్ధ

ప్రజాశక్తి-కొమరాడ

గురుకుల విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని గురుకులాల ఉమ్మడి జిల్లా సమన్వయకర్త డి.చంద్రావతి అన్నారు. బుధవారం మండలం కేంద్రంలోని బాలికల గురుకులాన్ని ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తరువాత భోజనాలను పరిశీలించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఆమె ఫోన్ చేసి పాఠశాల విషయాలు, పిల్లల చదువు గురించి అడిగి తెలుసుకున్నారు. గురుకులంలో నిర్వహించి సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో గురుకుల ప్రిన్సిపల్ రజనికుమారి పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి -భామిని

పెద్దదిమిలి పంచాయతీ పరిధిలో 60 మందికి బుధవారం సర్పంచ్ తొగరాన శ్రీను ఇళ్ల పట్టాలను పంపిణీ చేవారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పార్వతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం

హౌసింగ్ పీడీ రఘురాం

ప్రజాశక్తి-కొమరాడ

గ్రామాల్లో గృహనిర్మాణ పనులు వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ పి.రఘురాం అన్నారు. బుధవారం మండలంలోని దళియపేట గ్రామంలో గృహ నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు గృహ నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తుందన్నారు. అర్హులైన వారికి ఇల్లు మంజూరు చేసి నిధులు సమకూర్చి నిర్మాణాలు వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. బిల్లులు సకాలంలో లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తామన్నారు. లబ్ధిదారులకు ఇసుక, సిమ్మెంట్, ఐరన్ వంటి సామగ్రి ప్రభుత్వమే సమకూరుస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే సామగ్రిని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిఇ మోహన్‌రావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ గణేష్, సర్పంచ్, తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న పీడీ రఘురాం

వయోపరిమితి, పోస్టుల సంఖ్య పెంచాలి

డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రాము

ప్రజాశక్తి-విజయనగరం టౌన్


కానిస్టేబుల్, ఎస్ఐ పోస్టులకు అభ్యర్థుల వయో పరిమితితో పాటు పోస్టుల సంఖ్యను పెంచాలని డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రాము డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ప్రజా సంఘాల ఆఫీసులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఎస్సై కానిస్టేబుల్ నోటిఫికేషన్‌లో వయోపరిమితి ఐదు సంవత్సరాలు పెంచాలని ,పరీక్ష గడువు కాలాన్ని పెంచాలని ఫైర్, జైలు వార్డెన్ పోస్టుల ప్రస్తావన లేకపోవడంతో నాలుగేళ్లగా ఎదురు చూస్తున్న నిరుద్యోగుల ఆశలు నిరాశలయ్యాయని అన్నారు. వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని అన్నారు. జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, లేని పక్షాన జిల్లాలో ఉన్న నిరుద్యోగ యువతను ఐక్యం చేసి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని తెలిపారు. సమావేశంలో డివై ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ హరీష్, ఎన్.రుద్ర ప్రసాద్, సహాయ కార్యదర్శి బి.సతీష్, జిల్లా కమిటీ సభ్యులు రామ్మోహన్ ,వెంకటేష్ , నాయుడు పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తులను పూర్తిచేయాలి

ఐటిడిఎ పిఒ బి.నవ్య

ప్రజాశక్తి-సీతంపేట

ఎన్నికలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని ఐటిడిఎ పిఒ బి.నవ్య అన్నారు. బుధవారం సీతంపేట మండలంలోని బిఎల్ఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ప్రతీ దరఖాస్తును నిశితంగా పరిశీలించాలన్నారు. చనిపోయినవారి ఓట్లను తొలగించాలని, అదే విధంగా మైగ్రేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న వాటిని కూడా పూర్తి చేయాలని సూచించారు. 26వ తేదీలోపు అన్ని దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలన్నారు. 18 ఏళు దాటిన వారికి మాత్రమే ఓటు హక్కు కల్పించాలని అన్నారు. అనంతరం మండలంలో పులిపుట్టి పంచాయతీ పరిధిలో 26 మంది లబ్ధిదారులకు పట్టాలు తాలూకా దస్తావేజులను పిఒ నవ్య, సబ్ కలెక్టర్ నూరల్ ఉల్ కమర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్.నరసింహమూర్తి, డిటి కుమారి, తదితరులు పాల్గొన్నారు.



దస్తావేజులు పట్టాలు అందజేస్తున్న పిఒ నవ్య, సబ్‌కలెక్టర్ నూర్ ఉల్ కమర్

సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలి

డిఎస్‌పి హర్షిత

ప్రజాశక్తి -వీరఘట్టం

విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండి, చదువుపై దృష్టిపెట్టాలని దిశ డిఎస్‌పి హర్షిత సూచించారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణంలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి హర్షిత మాట్లాడుతూ తల్లిదండ్రులు చెప్పిన మాటలు వినాలన్నారు. చెడు అలవాట్లకు తావివ్వవద్దని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దూసి నాగమణి, వ్యాయామ ఉపాధ్యాయులు యశోద, ఎస్ఐ ఎం.హరికృష్ణ పాల్గొన్నారు.

మరిపివలసలో గడపగడపకు..

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని సూరంపేట సచివాలయ పరిధిలోని మరిపివలసలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని తక్షణమే పరిష్కరించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం అర్హులైన పేదలకు 36 రకాల సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎస్.సాంబమూర్తి, ఎంపిటిసి బి.వరలక్ష్మి, జెడ్‌పిటిసి ఎం.బాబ్జి, వైసిపి నాయకులు బి.శ్రీరాములునాయుడు, బి.చిట్టి రాజు, టి.వెంకట అప్పలనాయుడు, ఆర్‌వి పార్థసారథి, ఎన్.రామకృష్ణ పాల్గొన్నారు.



మొక్కకు నీరు పోస్తున్న ఎమ్మెల్యే కళావతి

మొక్కలు నాటిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

జగనన్న పచ్చతోరణం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో అటవీ శాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వి.కళావతి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, సబ్ కలెక్టర్ నూర్ ఉల్ కమర్, జిల్లా ఫారెస్ట్ అధికారి జిఎపి ప్రసూన, నియోజకవర్గ పరిశీలకులు డోల జగన్మోహన్ రావు, నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ యందవ రాధాకుమారి, కౌన్సిలర్లు, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సన్నద్ధం

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జయకృష్ణ

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

రానున్న ఎన్నికలకు ఇప్పటి నుంచే పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ కోరారు. బుధవారం స్థానిక టిడిపి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం రాజాం నియోజకవర్గం పొగిరి, రాజాంలో జరిగే ఇదేం కర్మ కార్యక్రమానికి టిడిపి అధినేత చంద్రబాబు హాజరవుతున్నారని తెలిపారు. పాలకొండ నియోజకవర్గం నుంచి అత్యధికంగా నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వైసిపి ప్రభుత్వంపై వ్యతిరేకతను ప్రజల్లోకి కార్యకర్తలు చురుగ్గా తీసుకెళ్లాలని, అప్పుడే రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపు సులభమవుతుందని చెప్పారు.


కేశవరావును పరామర్శిస్తున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జగదీశ్వరి

కేశవరావుకు జగదీశ్వరి పరామర్శ

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

టిడిపి సీనియర్ నాయకులు తాడంగి కేశవరావు భార్య యశోదమ్మ మృతి చెందడంతో బుధవారం ఆ కుటుంబాన్ని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి పరామర్శించారు. యశోదమ్మ మృతికి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కడ్రక కళావతి, తాడంగి రామారావు, అడ్డాకుల నరేష్, జానకి పాల్గొన్నారు.

కష్టపడి చదవాలి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఇంటర్, పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటినుంచే కష్టపడి చదవాలని జిసిడిఒ, సమగ్ర శిక్ష జిల్లా అధికారి రోజా రమణి సూచించారు. గుమ్మలక్ష్మీపురంలో ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివితే పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించడానికి వీలుంటుందన్నారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాల ప్రణాళిక ప్రతిఒక్కరూ పాటించాలన్నారు. పాఠశాల ఆవరణలో తాగునీరు, మరుగుదొడ్లను పరిశీలించారు. నాడు-నేడు పనులను పరిశీలించి, సూచనలు చేశారు. విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రాజెక్టులను సందర్శించారు. ప్రాజెక్టుల తయారీలో మంచి ప్రతిభ కనబరచడంతో విద్యార్థులను అభినందించారు. పాఠశాల ఆవరణలో పండించిన పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీరంజిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ అప్పలనాయుడు

కొత్తవలసలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-పాచిపెంట

మండలంలోని కొటికిపెంట పంచాయతీ కొత్తవలస గ్రామంలో సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు ఆధ్వర్యంలో బుధవారం పారిశుధ్య పనులు చేపట్టారు. పారిశుధ్య కార్మికులతో కాలువల్లో పూడికలు, రోడ్లపై ఉన్న చెత్తాచెదారాలు తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అప్పలనాయుడు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులను కోరారు. పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దరి చేరవని చెప్పారు. ముఖ్యంగా దోమల బెడద తగ్గుతుందన్నారు.

ఆర్‌సిఎం చర్చిలో క్రిస్మస్ సంబరాలు

ప్రజాశక్తి-మక్కువ

మక్కువలోని ఆర్‌సిఎం చర్చిలో ముందస్తు క్రిస్మస్ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైసిపి మండల నాయకులు రంగునాయుడు హాజరయ్యారు.

టిడిపిలో గ్రూపుల పోరు

- రాజాంలో ప్రతిభా భారతి - కోండ్రు మురళి
- విజయనగరం, గజపతినగరాల్లో అశోక్ - గీత, కె.ఎ.నాయుడు-శివరామకృష్ణ
- బాబు పర్యటనలో చక్కదిద్దేనా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

టిడిపిలో గ్రూపుల పోరు తారా స్థాయికి చేరింది. ఎప్పటికప్పుడు, ఎక్కడికక్కడ బహిర్గతమౌతునే ఉన్నాయి. జిల్లా పార్టీకి అన్నీ తానై వ్యవహరిస్తున్న అశోక్ వైఖరి పలు నియోజకవర్గాల నాయకులకు మింగుడు పడడం లేదు. మరికొన్ని చోట్ల నాయకుల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతోంది. సాక్షాత్తు బాబు పర్యటన ఏర్పాట్లలోనే ఈ విషయం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో నాయకుల మధ్య విభేదాలకు, గ్రూపుల పోరుకు బాబు చెక్ పెడతారా? లేక అధికారపక్షమే లక్ష్యంగా పర్యటన సాగుతుందా? అన్నదానిపై రాజకీయ విశ్లేషకులు ఆసక్తిగా చర్చిస్తున్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లా ఒకప్పుడు టిడిపికి కంచుకోట. మొత్తం 12 నియోజకవర్గాలు కైవసం చేసుకుని, అప్పటి కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించిన చరిత్ర ఉంది. కాల క్రమీణ జిల్లా నాయకత్వంలో ఒంటెద్దు పోకడలు, ప్రజా సమస్యలను పట్టించుకోకపోవడం, ప్రజలతో సంబంధాలు తగ్గడం, లౌకికవాదంపై మారిన వైఖరి వంటి కారణాలవల్ల పార్టీ జవసత్వాలు సన్నగిల్లిపోయాయి. చివరకు గడిచిన ఎన్నికల్లో టిడిపి చరిత్రను, రికార్డును వైసిపి బద్ధలగొట్టి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ చొచ్చుకుపోయింది. రాష్ట్ర పార్టీ పిలుపులు తప్పితే, జిల్లా, నియోజకవర్గ స్థాయిలో టిడిపి నాయకులు ప్రజా సమస్యలపై స్పందించిన దాఖలాలు లేదు. మరోవైపు జిల్లాలో నాయకుల మధ్య అనైక్యత, గ్రూపుల పోరు తారా స్థాయికి చేరింది. ముఖ్యంగా విజయనగరంలో మాజీ ఎమ్మెల్యే మీసాల గీత, కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజుల మధ్య చాలా కాలంగా విభేదాలు ఉన్నాయి. పార్టీ నాయకుల స్వతంత్రతను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారని, బిసిలను ఎదగనీయడం లేదని చాలా కాలంగా గీత చేస్తున్న అభియోగం. పలు మార్లు గీత తన అనుయాయులతో చంద్రబాబును కలిశారు. ఇప్పటికీ అదే ఒరవడి కొనసాగుతోంది. ఇటు గజపతినగరం మాజీ ఎమ్మెల్యే కెఎ నాయుడు, అశోక్ మధ్య కూడా విభేదాలు ఉన్నాయి. ఇప్పటి వరకు విమర్శల రూపంలో బహిర్గతం కాకపోయినప్పటికీ అశోక్ బిసిలపట్ల వివక్షగా, చిన్నచూపుగా వ్యవహరిస్తున్నారని కెఎ నాయుడు తన సన్నిహితుల వద్ద చెబుతున్నారు. ఇంతకన్నా ముఖ్యంగా కెఎ నాయుడ్ని టార్గెట్ చేస్తూ గజపతినగరం మరో నాయకుడు కరణం శివరామకృష్ణను ప్రోత్సహిస్తున్నారని విమర్శలు కూడా అశోక్‌పై ఉన్నాయి. బిసిల మధ్య చిచ్చుపెట్టి, ప్రభుత్వం ఏర్పాటైన సందర్భాల్లో కేబినెట్‌లో తన బెర్తు పదిలం చేసుకునేందుకు పార్టీలో సినియర్లను ఎదగనివ్వకుండా చేస్తున్నారన్ని చర్చ కూడా నడుస్తోంది. అటు రాజాంలో మాజీ స్పీకర్, టిడిపి సీనియర్ నేత కావలి ప్రతిభా భారతి, టిడిపి నియోకవర్గ ఇన్‌ఛార్జి కోండ్రు మురళి మధ్య విభేదాలు బాహాటంగానే కనిపిస్తున్నాయి. ఎవరికి వారే గ్రూపు రాజకీయాలు చేస్తున్నారని విశ్లేషకులు అంచనా. అందుకు తగ్గట్టే బాబు పర్యటనకు పలు పంచాయతీల్లో గ్రూపులవారీగా ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నారు. భవిష్యత్తులో రాజాం నియోజకవర్గం అసెంబ్లీ సీటు ఎవరికి ఇస్తారో? అన్నదానిపై ఆసక్తికరమైన చర్చ సాగుతుండగా, తమకే వస్తుందంటూ ఇద్దరూ ప్రచారం చేసుకుంటున్నారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో కాకలు తీరిన నేత పతివాడ నారాయణ స్వామినాయుడు వయసు మీరడంతో ఎవరికి వారే నాయకులు అన్నట్టుగా వ్యహరిస్తున్నారు. డెంకాడలో కంది చంద్రశేఖర్, భోగాపురంలో కర్రోతు బంగార్రాజు, నెల్లిమర్లలో కడగల ఆనంద్ నాయకులుగా చలా మణి అవుతున్నప్పటికీ, అంతా ఒక్కతాటిపైకి రావడం లేదు. ఇటు బొబ్బిలి నియోజకవర్గంలో గ్రూపుల బెడద పెద్దగా లేకపోయినప్పటికీ మాజీ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు, నియోజకవర్గంలో అన్నీ తానై వ్యవహరిస్తున్న బేబీ నాయనల ఆధిపత్య ధోరణులు కనిపిస్తున్నాయి. వీటన్నింటిపైనా బాబు ఇప్పట్లో దృష్టిసారిస్తారా? లేక వీటిని పక్కనబెట్టి కేవలం ప్రతిపక్షమే లక్ష్యంగా ప్రసంగాలకే పరిమితమౌతారా అన్నదానిపై చర్చనడుస్తోంది.

ఘనంగా సిఎం జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

జిల్లా వ్యాప్తంగా సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. అనేక చోట్ల రక్తదాన శిబిరాలు, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. భారీ ఎత్తున కేకులను కట్ చేసి, సంబరాలు చేసుకున్నారు.

పార్వతీపురం పట్టణంలోని బెలగాంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఎమ్మెల్యే జోగారావు ఆధ్వర్యంలో సిఎం జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, నియోజకవర్గ పరిశీలకులు శోభా హైమావతితో కలిసి ఆయన 50 కిలోల కేకును కట్‌చేశారు. ఈ సందర్భ:గా ఏర్పాటుచేసిన మెగా రక్తదాన శిబిరంలో 400 యూనిట్లకుపైగా రక్తాన్ని దానంచేశారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ వాకాడ నాగేశ్వరరావు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సాలూరు : సిఎం జగన్ జన్మదినం సందర్భంగా పట్టణంలోని సీతారామ ధర్మశాలలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 60మంది రక్తదానం చేశారు. ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.అప్పారావు పర్యవేక్షణలో నిర్వహించిన శిబిరంలో డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకృష్ణ కూడా రక్తదానం చేశారు. రక్తదాతలను డిప్యూటీ సిఎం రాజన్నదొర ప్రత్యేకంగా అభినందించారు. నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పి.వేణుగోపాలరావు, శ్రీరామ ఫౌండేషన్, మీకై మేము సంస్థలు సహకరించాయి. అర్బన్ బ్యాంకు అధ్యక్షుడు జర్జాపు ఈశ్వరరావు, వైసిపి పట్టణ అధ్యక్షుడు జర్జాపు సూరిబాబు మున్సిపల్ వైస్ చైర్మన్లు వంగపండు అప్పలనాయుడు, జర్జాపు దీప్తి, కౌన్సిలర్లు పాలవలస మధుసూదనరావు, గిరి రఘు, గొర్లి వెంకటరమణ, పప్పల లక్ష్మణరావు, శ్యామలాంబ కో-ఆపరేటివ్ స్టోర్స్ చైర్మన్ మేడిశెట్టి అప్పలనాయుడు, వైసిపి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గొర్లి జగన్మోహన్ రావు పాల్గొన్నారు.

పాచిపెంట : మండలంలోని పాచిపెంట గ్రామంలో సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు కేక్ కట్ చేశారు. వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు.

పాలకొండ : ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, నియోజకవర్గ పరిశీలకులు డోల జగన్మోహన్‌రావు ప్రారంభించారు. సీనియర్ నేత పాలవలస రాజశేఖరం ఇంటి వద్ద కేక్ కట్ చేశారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి


పార్వతీపురంటౌన్.. కేకు కట్ చేస్తున్న వైసిపి జిల్లా అధ్యక్షులు పరీక్షిత్‌రాజు, ఎమ్మెల్యే జోగారావు

పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ జనార్దన్‌నాయుడు ఆధ్వర్యాన మొక్కలు నాటారు. వైస్ ప్రిన్సిపల్ బి.ప్రభాకరరావు, ఐక్యూ ఎసి కోఆర్డినేటర్ బి.రాజు పాల్గొన్నారు.

వీరఘట్టం : మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, నియోజకవర్గ పరిశీలకులు డి.జగన్మోహనరావు కేకు కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి.గౌరమ్మ, డి.వెంకటరమణ నాయుడు, జెడ్‌పిటిసి జంపు కన్నతల్లి, ఉమామహేశ్వరరావు, కె.గోవిందరావు, కెఎల్ ప్రసాదరావు, డి.లలిత కుమారి, ఎన్.సుహాసిని, వి.రామచంద్రరావు, బి.లక్ష్మీనారాయణ, భోగి మాణిక్య చంద్రశేఖర్, కె.ఆంజనేయులు పాల్గొన్నారు.

కురుపాం : కురుపాంలో సాయిబాబా మందిరం వద్దనున్న మైదానంలో ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి ఆధ్వర్యాన సిఎం జన్మదిన వేడుకలు నిర్వహించారు. భారీ కేకును కట్ చేశారు. అనంతరం మెగా రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు పరీక్షిత్‌రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారిద్దరు రక్తదానం చేశారు. అనంతరం మహిళలకు నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడు ఎంపిపిలు శెట్టి పద్మావతి, కె.దీనమయ్య, ఉరిటి రామారావు, శెట్టి శ్యామల, జిల్లా కోఆప్షన్ షేక్ నిషార్, జెడ్‌పిటిసిలు జి.సుజాత, ద్వారపురెడ్డి లక్ష్మి, ఎం.రాధ, ఎం.శశికళ, సర్పంచ్ జి.సుజాత, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, కళింగ వైశ్య జిల్లా అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు, ఎంపిటిసి వెలమల బంగారునాయుడు, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి శెట్టి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : గుమ్మలక్ష్మీపురం గ్రామ సచివాలయం వద్ద సిఎం జగన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.గౌరీశంకర్రావు, వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్, పంచాయతీ కార్యదర్శి కిషోర్, విఆర్‌ఒ బోడమ్మ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

సీతంపేట : మండలంలోని కడగండి పంచాయతీ కడగండివలసలో ఎమ్మెల్యే వి.కళావతి, వైసిపి నియోజకవర్గ పరిశీలకులు డోల జగన్ కేకు కట్ చేశారు. ఆటల పోటీలలో గెలిచిన వారికి బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బి.ఆదినారాయణ, జెడ్‌పిటిసి లక్ష్మి, నాయకులు రాము, జెడ్‌పి కోఆప్షన్ సభ్యులు లక్ష్మి, ఎఎంసి చైర్మన్ మోహన్‌రావు పాల్గొన్నారు.

మక్కువ : వైసిపి మండల నాయకులు రంగునాయుడు ఆధ్వర్యంలో సినిమా థియేటర్ వద్ద జెడ్‌పిటిసి సభ్యులు మావుడి శ్రీనివాసరావు కేకు కట్ చేసి సంబరాలు ప్రారంభించారు.

భామిని : మండలంలోని కొరమ కూడలిలో అంబేద్కర్ విగ్రహం వద్ద వైసిపి నాయకులు అగుతముడి రఘు ఆధ్వర్యంలో సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, వైసిపి నాయకులు కొవ్వాడ చిరంజీవులు, టింగ అన్నాజిరావు, మజ్జి మోహన్‌బాబు, బొడ్డేపల్లి ప్రసాద్ రావు, గెల్లంకి రమేష్, కిల్లారి ఫల్గుణరావు పాల్గొన్నారు.



కురుపాం.. రక్తదానం చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి దంపతులు

శ్రీరంగపాడులో పంటకోత ప్రయోగం


పంట కోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ షణ్ముఖరాజు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

పంట కోత ప్రయోగం ద్వారా దిగుబడులను నిర్ధారించవచ్చని ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ పి.షణ్ముఖరాజు తెలిపారు. మండలంలోని శ్రీరంగపాడు గ్రామంలో బుధవారం కడ్రక సోమేశ్వరరావు అనే రైతు క్షేత్రంలో రాగి పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులతో పంట దిగుబడులను అంచనా వేయడానికి పంట కోత ప్రయోగం చేపట్టినట్లు తెలిపారు. రెండుసార్లు ఈ ప్రయోగం చేసి, దిగబడులు అంచనా వేశామన్నారు. వరి పంట కన్నా రాగి పంట ధర మార్కెట్లో ఎక్కువగా ఉందన్నారు. నీటి తడులు కూడా తక్కువగా అవసరం అవుతాయని తెలిపారు. అందరూ రైతులు రాగి విస్తీర్ణం పెంచాలని సూచించారు. అనంతరం కిల్లక నాగేశ్వరరావు ఎకరా విస్తీర్ణంలో పండిస్తున్న మిరప, పత్తి, రాగి, టమోటా, వేరుశనగ, వంగ మొక్కలను పరిశీలించారు. ఒక పంట బదులు పలు పంటలు వేయడం వల్ల వాతావరణ కాలుష్యం కాపాడుకోవడమే కాకుండా మొక్కలలో జీవవైవిధ్యం సాధించవచ్చని ఆయన తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను స్కంద ఆర్గానిక్ 42 కంపెనీ మార్కెటింగ్ చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సిహెచ్ ప్రసాదరావు, విఎఎలు సాయి కిరణ్, కె.భవాని, జి.ప్రబోధ్, కోఆర్డినేటర్లు మురళీమోహన్, జగదీష్, మిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

చిరుద్యోగులను తొలగించే ఆలోచన విరమించుకోవాలి

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

చిరుద్యోగులను తొలగించే ఆలోచనను విరమించుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు ప్రభుత్వానికి సూచించారు. బుధవారం పాలకొండ మున్సిపాలిటీలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్టు పద్ధతిలోకి మార్చాలన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు వయోపరిమితి 62 ఏళ్లకు పెంచాలని కోరారు. పాదయాత్రలో సిఎం జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

కళాకారుడికి సన్మానం

ప్రజాశక్తి-బలిజిపేట

మండలంలోని తుమరాడ గ్రామానికి చెందిన వృద్ధ కళాకారుడు చాకరాపల్లి ఈశ్వరరావును బుధవారం ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఎం.మురళీమోహన్ ఆధ్వర్యాన సన్మానించారు. ఈశ్వరరావు 84 ఏళ్ల వయస్సులో దేశభక్తి గీతాలు, నాటకాల్లో ఆకట్టుకుంటున్నారని హెచ్‌ఎం కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి.కళ్యాణ్ కుమార్, వి.శ్రీరాములు, ఎం.సత్యనారాయణ, డి.రవిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం


మృతిచెందిన షణ్ముఖరావు

మండలంలోని చెముడుగూడ పంచాయతీ కొసగూడ గ్రామ సమీపాన ఉన్న ప్రధాన రహదారి మలుపు వద్ద మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ఠన సివ్వాల షణ్ముఖరావు (46) మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం..

భామిని మండలం బత్తిలి గ్రామానికి చెందిన షణ్ముఖరావు, విజయలక్ష్మి దంపతులు బతుకు తెరువు నిమిత్తం ఎల్విన్‌పేటలో నూడిల్స్ షాపు నిర్వహిస్తున్నారు. ఉదయం బత్తిలి నుంచి వచ్చి వ్యాపారం చేసుకుని, రాత్రివేళ ఇంటికి వెళ్లేవారు. మంగళవారం సాయంత్రం బాగా చలిగా ఉందని భార్య విజయలక్ష్మి ఆటోలో ఇంటికి వెళ్లిపోయింది. షణ్ముఖరావు షాపు మూసివేసి ఇంటికి వెళ్తుండగా కొసగూడ మలుపు వద్ద ఉన్న విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టడంతో తుప్పల్లోకి వెళ్లి పడ్డాడు. ఎక్కువగా మంచు కురవడం, రాత్రి సమయం కావడం, ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో తలకి బలమైన గాయమై మృతి చెందాడు. బుధవారం ఉదయం వరకు గుర్తించలేదు. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న షణ్ముఖరావు మృతిచెందడంతో భార్య, బంధువులు రోదిస్తున్నారు. షణ్ముఖకు ఇద్దరు కుమారులున్నారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఎల్విన్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు.

సచివాలయ రికార్డులు తనిఖీ

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని తామరకండి సచివాలయంలో రికార్డులను ఎంపిడిఒ కృష్ణమహేష్ రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది హాజరు పట్టికలను, మిగతా రికార్డులను పరిశీలించారు. ఆయుష్మాన్ భారత్ గుర్తింపు కార్డుల సర్వే పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. సిబ్బంది, గ్రామ వాలంటీర్ల పనితీరుపై సమీక్షించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకె వర్మ, ఎఒ ఎంఎస్‌ఎల్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి పద్మావతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌బికె సందర్శన

పెదబోగిలి రైతుభరోసా కేంద్రాన్ని ఎంపిడిఒ బి.కృష్ణమహేశ్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బందుల్లేకుండా చూడాలని ఆదేశించారు. వ్యవసాయ, సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కార్యాలయ ఎఒ ఎంఎస్ఎన్ ప్రసాద్, కెకె వర్మ, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ కృష్ణమహేష్‌రెడ్డి

సమయపాలన పాటించాల్సిందే

ప్రజాశక్తి-కొమరాడ

సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఎంపిడిఒ ఎల్‌వి అప్పారావు సూచించారు. బుధవారం మండలంలోని విక్రమ పురం గ్రామ సచివాలయాన్ని ఆయన సందర్శి ంచారు. సచివాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని ఉద్యోగులకు ఆదేశించారు. ప్రజలకు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పినా, వారిని గౌరవించకపోయినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శివుని గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఎంపిడిఒ పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, కోటపాం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంపిడిఒ అప్పారావు పరిశీలించారు. మెనూ కచ్చితంగా అమలు చేయాలని సూచించారు.